సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 20 । నవంబర్ । 2023



సోమశిలలో 29.500 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 29.500 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 17 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	-రూ.62,860
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	- రూ.5,651
3 శాతం జీఎస్టీతో..	- రూ.5,821
సవర (8 గ్రా)	- రూ.46,568

గరిష్టం/కనిష్టం
32.3 /24.6

వాతావరణం

ఆదివారం గాలిలో తేమ 72 శాతం ఉంది. సోమవారం జిల్లాలో ఉష్ణోగ్రతలు, ఎండతీవ్రత సాధారణంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

సీఎం సభను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మత్స్యకార భరోసా కార్యక్రమానికి ఈ నెల 21న సూళ్లూరుపేటకు విచ్చేస్తున్న సందర్భంగా సీఎం సభను విజయవంతం చేద్దామంటూ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చిల్లకూరులోని ఆయన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రిస్కిల్లా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మహేంద్రరెడ్డి, మండల కన్వీనర్లు వెంకటరత్నం, రఘునాయుడు పాల్గొన్నారు.

చెంగాళమ్మకు బంగారు లక్ష్మీ కాసుల హారం



అమ్మవారికి బంగారు లక్ష్మీ కాసుల హారాన్ని బహూకరిస్తున్న దాతలు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి పట్టణానికి చెందిన ఉదయగిరి మధుబాబు దంపతులు 39.600 గ్రాముల బంగారు లక్ష్మీ కాసుల హారాన్ని ఆదివారం పాలకమండలి సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డికి అందజేశారు. అమ్మవారికి మొక్కు ఉండడంతో స్వయంగా లక్ష్మీ కాసుల హారాన్ని తయారు చేయించి అమ్మవారికి సమర్పించారు. పర్వదినాల్లో అమ్మవారికి ఆ హారాన్ని అలంకరించాలని పాలకమండలిని కోరారు.

మూలస్థానేశ్వరుని సేవలో వేమిరెడ్డి దంపతులు



కార్తీక దీపం వెలిగిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి - ప్రశాంతిరెడ్డి దంపతులు

నెల్లూరు(బృందావనం): రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి – ప్రశాంతిరెడ్డి దంపతులు నెల్లూరులోని మూలాపేటలో వెలసిన శ్రీభువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామిని ఆదివారం దర్శించుకున్నారు. కోటి సోమవారం సందర్భంగా ఆలయంలో కార్తీక దీపాన్ని వెలిగించి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ ఒకటో తేదీ నుంచి 3వ తేదీ వరకు కార్తీకమాస లక్ష దీపోత్సవాన్ని నెల్లూరు వీఆర్సీ మైదానంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించినట్లు తెలిపారు. కార్తీక మాస లక్ష దీపోత్సవంలో జిల్లాలోని భక్తులు విశేషంగా పాల్గొని శివకేశవులను దర్శించుకోవాలని కోరారు. తొలుత ఆలయ అర్చకులు వేమిరెడ్డి దంపతులకు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు.

జనహిత, వాత్సల్యకు వితరణ



నెల్లూరు(బృందావనం): కెనరా బ్యాంక్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండాయపాళెం రోడ్డులోని జనహిత, వాత్సల్య నిరాధార బాలబాలికల కేంద్రానికి రూ.50 వేల విలువైన మోటార్లు, ఫ్యాన్లు, కుర్చీలను ఆదివారం అందజేశారు. జనహిత, వాత్సల్య సంఘటన కార్యదర్శి సాంబశివరావు, కెనరా బ్యాంక్ భక్తవత్సలనగర్ చీఫ్ మేనేజర్ రంగనాథ్, ఫీల్డ్ ఆఫీసర్ బషీర్, రీజినల్ ఆఫీస్‌కు చెందిన సురేష్, రవిశంకర్ పాల్గొన్నారు.

కండలేరులో 11.170 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 11.170 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిజ్‌కు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు

శివోహం



సంగంలోని సంగమేశ్వరాలయంలో పుష్పాలంకృత శివలింగం

కోటి సోమవారం సందర్భంగా ఆదివారం జిల్లాలోని శైవక్షేత్రాల్లో పరమేశ్వరునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అర్చకులు సర్వశుభంకరుడైన శివుడికి ఏకాదశ రుద్రాభిషేకాలు, విశేష అలంకరణలు చేపట్టారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆ సందర్భంగా శైవక్షేత్రాల్లో కార్తీక శోభ సంతరించుకుంది.



నెల్లూరులోని మూలస్థానేశ్వర ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో మల్లికార్జునస్వామి - గంగా కామాక్షితాయి కల్యాణోత్సవం

నిఘానేత్రం



తాము చేసే నేరాలు ఎవరూ చూడడం లేదని నేరస్తులు భావిస్తారు. కానీ నేరాల కట్టడిలో భాగంగా పోలీసుశాఖ జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలే నేరస్తులను పట్టిస్తున్నాయి. నిఘా నేత్రం అడుగడుగునా వెంటాడుతూ నేరాల కట్టడిలో కీలకంగా వ్యవహరిస్తున్నాయి.

- జిల్లావ్యాప్తంగా 11,513 సీసీ కెమెరాలు
- స్పెషల్ డ్రైవ్ ద్వారా 1,387 ఏర్పాటు
- నేరస్తులను పట్టుకోవడంలో కీలక పాత్ర
- కేసులను ఛేదించడంలో దోహదం
- పోలీస్ కంట్రోల్ రూం నుంచి నిరంతర పర్యవేక్షణ

నెల్లూరులోని పొగతోటలో ఓ ప్రముఖ వైద్యుడి ఇంట్లో చోరీ జరిగింది. నిందితులు పెద్ద ఎత్తున బంగారు, నగదు అపహరించుకుని వెళ్లారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు స్థానికంగా ఉండే సీసీ కెమెరాలను పరిశీలించారు. సీసీ ఫుటేజ్‌లో నిందితులు పరారవుతున్న దృశ్యాలు లభ్యమయ్యాయి. వాటి ఆధారంగా కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేశారు.

ఈ ఏడాది మార్చిలో నెల్లూరు బీవీనగర్‌కు చెందిన టి.పద్మ తన మూడేళ్ల మనువడు సవ్యసాక్షిత్‌తో కలిసి రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయానికి వెళ్లారు. ఆమె గుడిలో పూజలు చేస్తుండగా సవ్యసాక్షిత్ అదృశ్యమయ్యాడు. దీంతో ఆమె జరిగిన విషయాన్ని దర్గామిట్ట పోలీసులకు తెలియజేశారు. పోలీసులు గాలించినా బాలుడి జాడ తెలియరాలేదు. నిందితురాలు బాలుడి ఒంటిపైనున్న బంగారు చైన్‌ను అపహరించి బాలుడిని వదిలి వెళ్లిపోయింది. కాగా పోలీసులు గుడి సమీపంలోని సీసీ ఫుటేజ్‌లను పరిశీలించగా ఓ మహిళ బాలుడిని కిడ్నాప్ చేయడాన్ని గుర్తించారు. అనంతరం ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టి అరెస్ట్ చేశారు.



కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో పలు సంచలనాత్మక కేసులను ఛేదించడంలో సీసీ కెమెరాలు ఎంతో దోహదం చేస్తున్నాయి. పోలీసుశాఖ నేరాల కట్టడిలో భాగంగా జిల్లావ్యాప్తంగా పలు కూడళ్లు, ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. జిల్లావ్యాప్తంగా ప్రతి వీధి, ప్రతి రోడ్డు, కూడళ్లలో ఏర్పాటు చేసిన ఈ నిఘా నేత్రాలు పోలీసుశాఖ అధీనంలో ఉన్నాయి. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పోలీసుశాఖ సిబ్బంది ఈ సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడ చిన్న తప్పు చేసినా నిఘా నేత్రం నుంచి తప్పించుకోలేమన్న భావన కలిగేలా పోలీసులు చర్యలు చేపడుతున్నారు,.

పోలీసు యంత్రాంగం పర్యవేక్షణ

జిల్లావ్యాప్తంగా గతంలో 10,126 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గతేడాది పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అదనంగా 1,387 సీసీ కెమెరాలు స్థానిక ప్రజాప్రతినిధులు, దాతల సాయంతో ఏర్పాటు చేయించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 11,513 సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి. అందులో నెల్లూరు నగరంలో 6,130, నెల్లూరు రూరల్ ప్రాంతంలో 1,041, కావలిలో 1,885, ఆత్మకూరులో 836 సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి. నెల్లూరు నగరంతోపాటు పట్టణ ప్రాంతాల్లో అత్యాధునిక సీసీ కెమెరాల ద్వారా నిఘా ఉంచి పోలీసు యంత్రాంగం పర్యవేక్షణ చేస్తోంది.

ఎక్కడెక్కడ..

ఇప్పటికే నెల్లూరు నగరంలో దాదాపు అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా జాతీయ రహదారులు, కూడళ్లు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, కృష్ణపట్నం పోర్టు పరిసరాలు, పరిశ్రమల వద్ద, ప్రధాన రోడ్లపై, ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రాంతాల్లో, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల వద్ద, జనసంచారం ఉండే ప్రాంతాల్లో, దేవాలయాలు, దర్గాలు, చర్చిలు, మసీదులు, షాపింగ్‌మాల్స్‌లో ఈ నిఘా నేత్రాలను అమర్చారు. జిల్లాలోని మేజర్, మైనర్ పంచాయతీల్లో కూడా వీటిని అమర్చి నిత్యం పర్యవేక్షిస్తున్నారు.



బాలుడిని కిడ్నాప్ చేసి తీసుకెళుతుండగా రికార్డయిన సీసీ ఫుటేజ్ (ఫైల్)



కుక్కలను అపహరించుకుని వెళుతున్న దుండగులు (ఫైల్)

నిందితులను గుర్తించడంలో..

సీసీ కెమెరాలు నేరస్తులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఎక్కడైనా మిస్సింగ్ కేసులు నమోదైనా, కిడ్నాప్ కేసుల్లో నిందితులను గుర్తించడంలోనూ సీసీ ఫుటేజీలే ఆధారమవుతాయి. దొంగతనాలు జరిగినప్పుడు కూడా పరిసర ప్రాంతాల్లో సీసీ ఫుటేజీ కీలకమవుతోంది. చైన్ స్నాచింగ్‌లు, రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలోనూ ఎవరిది తప్పో తెలుసుకోవడంలో సీసీ కెమెరాలు ఉపయోగపడుతున్నాయి. పెద్ద ఉత్సవాలు, జాతరలు జరిగే సమయాల్లో కూడా సీసీ కెమెరాల ద్వారానే పర్యవేక్షిస్తున్నారు. ఏదైనా నేరం జరిగినప్పుడు సీసీ ఫుటేజీల ద్వారానే నేరం జరిగిన తీరును పరిశీలించే అవకాశం ఉంటుంది.

24 గంటలూ విధుల్లో..

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ 24 గంటలూ పనిచేస్తోంది. సీసీ కెమెరాల దృశ్యాలను వీక్షించేందుకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో భారీ తెరలు ఏర్పాటు చేశారు. ఇక్కడ డయల్ 100, ఎల్‌హెచ్‌ఎంఎస్ సీసీ కెమెరాల నియంత్రణ జరుగుతుంది. దాదాపు 10 మంది పోలీసులు ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. మూడు షిఫ్ట్‌ల వారీగా విధులు నిర్వర్తిస్తూ గమనిస్తుంటారు. నిత్యం ఏదో ఒక ప్రాంతం నుంచి వచ్చే ఫిర్యాదులను ఇక్కడి నుంచే పరిశీలించి పరిష్కరిస్తుంటారు. ప్రభుత్వం మ్యాట్రిక్స్ ద్వారా ఏర్పాటు చేసిన 347 కెమెరాలు, పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన 213 కెమెరాలు అనుసంధానం చేసి వీక్షిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నారు.

నేర నియంత్రణకు దోహదం



నేర నియంత్రణ, ఛేదనకు సీసీ కెమెరాలు దోహదపడుతున్నాయి. అనేక క్లిష్టమైన కేసులను సైతం సీసీ ఫుటేజీల ఆధారంగా ఛేదించాం. దుకాణాలు, విద్యాసంస్థలు, షాపింగ్ మాల్స్, బహుళ అంతస్తుల భవనాలు, గృహాలు, ఆర్టీసీ బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లలో విధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. ఇప్పటికే పెద్ద ఎత్తున సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. నేర నియంత్రణ, కేసుల ఛేదన కోసం పోలీసులు తీసుకుంటున్న చర్యలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలి.

– డి.శ్రీనివాసరెడ్డి, నగర డీఎస్పీ

సుమనోహారం.. పుష్పయాగం

- తిరుమల శ్రీవారి ఆలయంలో వేడుక
- తిరుచానూరులో సిరులతల్లికి శోభాయమానంగా విరుల నివేదన
- దేవదేవేరుల సన్నిధిలో విరిసిన సుగంధ పరిమళం

శ్రీవేంకటేశ్వరస్వామి దివ్య చరణాలను స్పృశించిన సంపంగి.. సెంటు జాజులు.. చామంతి.. రోజాలు సంబరపడ్డాయి. మల్లెలు.. మొగలిరేకులు సుగంధ పరిమళాలు వెదజల్లాయి.. పొగడ.. దేవగన్నేరు.. కలువ.. మనోరంజితం.. పారిజాతం మనోహర సౌరభాలు విరజిమ్మాయి. తులసి.. దవణం.. బిల్వం.. పన్నీరు.. కదిరి పచ్చ పత్రాలు వైకుంఠనాథుని అర్చనలో సగర్వంగా శోభిల్లాయి. కార్తీక మాసం.. శ్రవణా నక్షత్ర సుముహూర్తాన శ్రీవారి దేవేరి శ్రీపద్మావతీదేవిని అభిషేకించిన విరులు పునీతమయ్యాయి.



తిరుమలలో శ్రీవారికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు



తిరుచానూరులో పద్మావతి అమ్మవారికి పుష్పయాగం

తిరుమల/తిరుచానూరు (చంద్రగిరి) : కార్తీకమాసం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం శోభాయమానంగా పుష్పయాగ మహోత్సవం నిర్వహించారు. 17 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారికి వేడుకగా పుష్పార్చన నిర్వహించారు. బ్రహ్మోత్సవ సమయంలో తెలిసో తెలియకో జరిగిన దోష నివారణార్థం పుష్పయాగం జరిపించడం ఆనవాయితీ. అందులో భాగంగా దేవదేవేరులను విశేషంగా అలంకరించి పుష్ప కైంకర్యం సమర్పించారు. వేద మంత్రాల నడుమ చామంతి, వృక్షి, సంపంగి, సెంటు జాజులు, పొగడ, రోజా, గన్నేరు, మల్లె, మొల్లలు, కనకాంబరం, తామర, కలువ, మొగలిరేకులు, మాన సంపంగి, నిత్యమల్లి, మనోరంజితం, పారిజాతం పుష్పాలు, తులసి, మరువం, దవణం, బిల్వం, పన్నీరు, కదిరిపచ్చ పత్రాలతో అర్చించారు. ఏపీతోపాటు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ నుంచి దాతలు అందజేసిన మొత్తం 8 టన్నుల పుష్పాలను యాగంలో వినియోగించారు. పుష్పాల సేకరణకు విశేషంగా కృషి చేసిన ఉద్యానవనశాఖ డీడీ శ్రీనివాసులును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి, జేఈఓ సదాభార్గవి, డిప్యూటీ ఈఓ లోకనాథం, వీజీఓ నందకిషోర్, పారుపత్తేదార్ ఉమామహేశ్వర్‌రెడ్డి, పేష్కార్ శ్రీహరి పాల్గొన్నారు.

తిరుచానూరులో..

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పుష్పాలు, పత్రాలను అమ్మవారికి సమర్పించారు. పుష్పయాగం కోసం వివిధ రాష్ట్రాల నుంచి దాతలు మొత్తం 4 టన్నులు పుష్పాలను అందజేశారు. సిరులతల్లికి 14 రకాలు పుష్పాలు, 6 రకాల పత్రాలను నివేదించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్లు శేషగిరి, మధు, ఏవీఎస్‌ఓ శైలేంద్రబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి
పెన్నార్ డెల్టాకు సాగునీరు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు సోమశిల జలాశయం నుంచి పెన్నార్ డెల్టాకు మొదటి పంటకు సంబంధించి సోమవారం నుంచి సాగునీరు విడుదల చేయనున్నట్లు జలవనరులశాఖ ఎస్‌ఈ కృష్ణమోహన్ ఆదివారం తెలిపారు. జలాశయంలో ఉన్న ప్రస్తుత నీటి నిల్వ ఆధారంగా 2 లక్షల ఎకరాలకు పెన్నార్ డెల్టా పరిధిలోని కనిగిరి, సర్వేపల్లి జలాశయాలకు సాగునీరు ఇవ్వనున్నట్లు తెలిపారు. సంబంధిత ఆయకట్టు రైతులు నీటి లభ్యత తక్కువగా ఉన్న పరిస్థితుల్లో తగు జాగ్రత్తలు పాటించి నీటిని వృథా చేయకుండా పంటలు పండించుకోవాలని సూచించారు. తాగు, సాగునీటికి సంబంధించి వ్యవసాయశాఖ, తాము సమన్వయంతో సమీక్షలు నిర్వహించి ఎప్పటికప్పుడు రైతులకు సూచనలు అందజేస్తామని తెలిపారు. డెల్టా పరిధిలోని రైతులు నారుమడులకు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. దువ్వూరు బ్రాంచ్ కెనాల్, సదరన్, కేఎం చానళ్లతోపాటు దువ్వూరు కాలువ చెరువుల కింద 7,430 ఎకరాలు, బుచ్చిరెడ్డిపాళెం మండల పరిధిలో 12,313 ఎకరాలు, కొడవలూరు 22,561 ఎకరాలు, విడవలూరులో 27,216 ఎకరాలు, కోవూరులో 12,454 ఎకరాలు, దగదర్తిలో 11 వేల ఎకరాలు, అల్లూరులో 28,140 ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. దీంతోపాటు సర్వేపల్లి కాలువ పరిధిలో 47 వేల ఎకరాల విస్తీర్ణం ఉండగా, 44,300 ఎకరాలకు సాగునీరందించేలా ఐఏబీలో తీర్మానించారని తెలిపారు. జాఫర్‌సాహెబ్ కాలువ పరిధిలోని నెల్లూరురూరల్, ఇందుకూరుపేట, టీడీగూడూరు మండలాల్లో 34,632 ఎకరాలకు సాగునీరు అందనుందని తెలిపారు.

కాళంగి నదిపై కొత్త వంతెన



- రూ.35 కోట్లతో నిర్మాణం
- ముఖ్యమంత్రి చేతులమీదుగా రేపే శంకుస్థాపన

సూళ్లూరుపేట : పట్టణంలోని చెంగాళమ్మ ఆలయ సమీపంలో కాళంగి నదిపై రూ.35 కోట్లతో నూతన వంతెన నిర్మించనున్నారు. మంగళవారం ఈ మేరకు కొత్త వంతెనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించనున్నారు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం కాళంగి నదిపై సుమారు 125 ఏళ్ల క్రితం బ్రిటిష్‌వారు నిర్మించిన వంతెన ఉంది. పెరిగిన ట్రాఫిక్ నేపథ్యంలో ఈ వంతెన ఇరుకుగా మారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్రంగా పడుతున్నారు. దీంతో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రత్యేక చొరవ తీసుకుని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఇటీవలే నిధులు మంజూరు చేయించారు. నాలుగు లేన్ల వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీనిపై పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జితోపాటు చిన్నపాటి చెక్‌డ్యామ్ నిర్మిస్తే తాగునీటి అవసరాలు తీర్చుకోవచ్చని సూచిస్తున్నారు.

టీడీపీ నిర్లక్ష్యం

కాళంగి నదిపై ప్రస్తుతం ఉన్న వంతెన ప్రమాదకరంగా ఉంది. పగుళ్లు రావడంతో కూలేందుకు సిద్ధంగా మారింది. దీనిపై 2014లో కొత్త వంతెన నిర్మించాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అప్పటి టీడీపీ ప్రభుత్వానికి విన్నవించారు. అయితే నాటి పాలకులు నిర్లక్ష్యం వహించి పట్టించుకోలేదు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కిలివేటి పక్కాగా ప్రతిపాదనలు అందజేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిధులు విడుదల చేయడంతో పట్టణవాసుల కల నెరవేరుతోంది.

క్లుప్తంగా

కనులపండువగా వెంకటేశ్వరుడి కల్యాణం



నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వేడుకగా ఆదివారం నిర్వహించారు. స్వామివార్లకు అభిషేకాలు, పూజలను శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయకర్తలుగా నాతా రాజా రామ్మోహన్‌రావు, పద్మలత దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లుగుప్తా, రత్నం, కోశాధికారి మస్తాన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని 17వ డివిజన్లో గల గ్రామికనగర్, వెలగచెట్టు సెంటర్‌లో రూ.80 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపనను మేయర్ స్రవంతితో కలిసి ఆదివారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ డివిజన్లో అభివృద్ధి పనులను రూ.4.5 కోట్లతో చేపట్టామని వెల్లడించారు. మరో రూ.రెండు కోట్లను మంజూరు చేసేలా చర్యలు చేపడతామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నేత్రపర్వంగా శివేలి ఉత్సవం



నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో మండల పూజలను వేడుకగా నిర్వహిస్తున్నారు. విశేషాలంకారంలో అయ్యప్పస్వామి దర్శనమిచ్చారు. శివేలి ఉత్సవం, విశేష పూజా కార్యక్రమాలను జరిపారు. ఉభయకర్తలుగా ఇంటూరి దీననాథ్, కొమ్మినేని శ్రీనివాసరావు, సునీల్‌రెడ్డి, కారంపూడి నాగరాజా, వెంకటరమణయ్య హనుమంతాచారి, శశిధర్ రెడ్డి, పెంచలయ్య, వేమన చెంచుమురళి దంపతులు వ్యవహరించారు. శ్రవణా నక్షత్రం, కోటి సోమవారాన్ని పురస్కరించుకొని సహస్రదీపారాధనను నిర్వహించారు.



వీఆర్సీ మైదానంలో ఏర్పాటు చేసిన బిగ్ స్క్రీన్



తరలివచ్చిన క్రీడాభిమానులు

ప్రపంచ కప్ ఫైనల్స్ వీక్షణ

అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో భారత్, ఆస్ట్రేలియా మధ్య ఆదివారం నిర్వహించిన ఫైనల్స్‌ను వీక్షించేందుకు వీలుగా నగరంలోని వీఆర్సీ క్రీడామైదానంలో బిగ్ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. మ్యాచ్‌ను క్రీడాభిమానులు వీక్షించి హుషారుగా గడిపారు. చివరికి ఆస్ట్రేలియా విజయం సాధించడంతో నిరాశగా వెనుదిరిగారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆదేశాల మేరకు క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీవీఎస్ మూర్తి, కార్యదర్శి నిఖిలేశ్వరరెడ్డి పర్యవేక్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

బీసీ సదస్సు జయప్రదానికి పిలుపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కందుకూరులో ఈ నెల 27న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బీసీ సదస్సును జయప్రదం చేయాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రాంతికుమార్, సోమరాజు పిలుపునిచ్చారు. హరనాథపురంలోని రాధే గెస్ట్ ఇన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వీరు మాట్లాడారు. కందుకూరులోని శివాలయంలో స్వామివారికి రుద్రాభిషేకాన్ని నిర్వహించిన అనంతరం రాష్ట్ర స్థాయి బీసీ సదస్సును జరపనున్నామని తెలిపారు. కార్యక్రమానికి భారీగా తరలిరావాలని కోరారు. తొలుత చలో కందుకూరు పోస్టర్లను ఆవిష్కరించారు.



మాట్లాడుతున్న సోమరాజు

బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు పలమాల శ్రీహరిరావు, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, నేతలు విజయమ్మ, మాల్యాద్రి, సుమన్, వాసు తదితరులు పాల్గొన్నారు.



మినీబైపాస్‌లోని తన నివాసంలో మ్యాచ్‌ను వీక్షిస్తున్న ఎంపీ ఆదాల



తిలకిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

బుల్లెట్ ఢీకొని వాహనచోదకుడి మృతి



నెల్లూరు(క్రైమ్): బుల్లెట్ బైక్ ఢీకొనడంతో వాహనచోదకుడు మృతి చెందిన ఘటన మినీబైపాస్‌లో చోటుచేసుకుంది. వివరాలు.. వెంగళరావునగర్‌కు చెందిన రాము (37), కమల దంపతులకు ఇద్దరు పిల్లలు. టైల్స్ పనులను రాము చేసుకుంటుండగా, కనకమహల్ సమీపంలోని సీఎమ్మార్ షాపింగ్ మాల్లో సేల్స్‌గర్ల్‌గా కమల పనిచేస్తున్నారు. రోజూ రాత్రి తన భార్యను బైక్‌పై ఇంటికి తీసుకెళ్లేవారు. ఈ క్రమంలో శనివారం రాత్రి వెళ్లగా, తాను ఆటోలో వస్తానని ఆమె చెప్పడంతో రాము వెనుదిరిగారు. మినీబైపాస్ మీదుగా ఇంటికెళ్తుండగా, పాపులర్ షూ మార్ట్ సమీపంలో వెనుక నుంచి బుల్లెట్ బైక్ వేగంగా ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన రామును చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. రాత్రంతా భర్త ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితులను కమల ఆరాతీసినా ప్రయోజనం లభించలేదు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదంలో రాము మృతి చెందారని.. మృతదేహం జీజీహెచ్ మార్చురీలో ఉందని తెలుసుకున్న బాధితురాలు హుటాహుటిన ఆస్పత్రికి చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మేరకు నార్త్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై గీతారమ్మ కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో పల్లకిసేవ



నెల్లూరు(బారకాసు): నగరంలోని గోమతినగర్‌లో గల సత్యసాయి మందిర సమీప ప్రాంతాల్లో పల్లకిసేవను సత్యసాయిసేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రామతీర్థానికి చెందిన సత్యసాయి భక్తులు కీర్తనలను ఆలపించారు. అనంతరం వంద మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రసాదాన్ని అందజేశారు. మందిర గౌరవాధ్యక్షుడు మురళీకృష్ణ, సమితి కన్వీనర్ కొండా శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



గ్లోబల్ గ్రీన్ కాన్హా రన్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

నెల్లూరు(బృందావనం): భావితరాల మనుగడ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ప్రముఖ గుండెవ్యాధి నిపుణుడు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. గ్లోబల్ గ్రీన్ కాన్హా రన్‌ను రామచంద్ర మిషన్, హార్ట్ ఫుల్‌నెస్ ధ్యాన సంస్థ, ఫారెస్ట్స్ బై హార్ట్ ఫుల్‌నెస్, భారత ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి ప్రారంభమైన రన్ సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహం మీదుగా పొదలకూరు రోడ్డులోని రామచంద్ర మిషన్ వరకు సాగింది. రామచంద్ర మిషన్ నెల్లూరు కేంద్ర కో ఆర్డినేటర్ వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నెల్లూరు(క్రైమ్): నేరప్రవృత్తిని వీడి సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని.. హద్దుమీరితే చర్యలు తప్పవని వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ నారాయణ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్టెడ్లు, కేడీలు, డీసీలకు స్టేషన్లో ఆదివారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆయన మాట్లాడారు. రౌడీయిజం చెలాయించినా, ఘర్షణలకు పాల్పడినా ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు. నేరాలకు తరచూ పాల్పడే వారిపై పీడీ యాక్ట్‌లు నమోదవుతున్నాయని, ఇప్పటికైనా ప్రవర్తనను మార్చుకొని సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని సూచించారు. ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేసి వెళ్లాలని ఆదేశించారు.



క్రీడలతో మానసికోల్లాసం



వివిధ పోటీల్లో విజేతలు

కొడవలూరు: క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసికోల్లాసాన్ని పొందవచ్చని ఐటీడీఏ పీఓ మందా రాణి పేర్కొన్నారు. జన జాతీయ గౌరవ దివస్‌ను పురస్కరించుకొని ఐటీడీఏ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాల్లోని గిరిజన గురుకులాల విద్యార్థులకు క్రీడా పోటీలను మండలంలోని చంద్రశేఖరపురం గిరిజన గురుకులంలో ఆదివారం నిర్వహించారు. వాలీబాల్, జావెలిన్ త్రో, ఆర్చరీ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 33 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరిని అభినందించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఇక్కడ గెలుపొందిన విద్యార్థులు విశాఖపట్నంలో ఈ నెల 23న నిర్వహించనున్న జాతీయ పోటీల్లో పాల్గొననున్నారని చెప్పారు. ఏఎంఓ శాంత కుమారి, ప్రిన్సిపల్ విష్ణుప్రియ, పీడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్స్‌తో సమావేశం నేడు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో సమావేశాన్ని నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించనున్నామని ఆర్ఐఓ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆయా కళాశాలల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థుల అడ్మిషన్లు, రికగ్నిషన్, పరీక్ష ఫీజు చెల్లింపు, అధ్యాపకుల వివరాల నమోదు, ప్రత్యేకావసరాల గల విద్యార్థుల సమాచార సేకరణ తదితరాలపై చర్చించనున్నామని చెప్పారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ప్రిన్సిపల్స్ తగు సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

నిమ్మ ధరలు

పెద్దవి	: రూ.45
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.8



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: రూ.102
లేయర్ (లైవ్)	: రూ.105
బ్రాయిలర్ చికెన్	: రూ.186
స్కిన్‌లెస్ చికెన్	: రూ.206
లేయర్ చికెన్	: రూ.178

